# లోక విద్య ప్రపంచం

పక్షపత్రిక

లోకవిద్యాధరుల గొంతు

సంపుటి-1, సంచిక-6 16 జనవరి 1 ఫిబ్రవరి- 2014 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2


## వ్యవస్థీకృతమైన అవినీతి నిర్మూలన మాత్రమే సమసమాజ నిర్మాణానికి దోహదపడుతుందా?

120 కోట్లున్న భారతీయ ప్రజలందరూ వివిధ రకాల కులాలుగా, మతాలుగా, జాతులుగా, ప్రాంతాలతోపాటు వివిధ ఉత్పత్తి, సేవారంగాలనే విభాగాలతో పాటు మహిళలను కూడా ప్రత్యేక తరగతిగా ప్రస్తుత వాతావరణం విభజించింది. దీనికి తోడు ధనిక, మధ్యతరగతి, దారిద్ర్యరేఖ దిగువనున్న తరగతిగా మన ప్రణాళికా సంఘం ప్రభుత్వ నిర్ణయాల ద్వారా విభజించారు. దానికన్నింటికి ప్రధానకారణం వేతనాలలో అతిభయంకరమైన వ్యత్యాసాలతోపాటు నిరుద్యోగం లేదా చిరుద్యోగం. గ్రామీణ ప్రాంతంలో రోజుకు 30 రూ॥లు అనగా నెలకు రూ. 1000/-లు దొరుకుతొంటే ఐ.టి. పరిశ్రమలలో నెలకు 5 నుండి 6 లక్షల రూ॥ల వరకు సంపాదిస్తున్నారంటే మానవ శ్రమకు మధ్య వత్యాసం 500 వందల రెట్లకు (అంటే 50,000%) పైగా వున్నదన్నమాట. అత్యధిక జనాభా కనీసావసరాలకోసం శ్రమిస్తుంటే మధ్యతరగతి, ఉన్నత తరగతుల వారు పెద్దగా కష్టాలు లేకుండా సౌకర్యవంతమైన జీవితం గడపవచ్చని ఎవరికైనా బోధపడుతుంది. వీరికి పిల్లలను చదివించడం, వైద్యం, ఇల్లు కట్టుకోవడం మొదలైన రంగాల్లో అవినీతి ప్రధాన సమస్యగా కనబడుతుంది. ఎందుకంటే అవే వీరికి ప్రధాన సమస్యలు. ఈ అవినీతిలో అందరికన్నా ఎక్కువ నష్టపోయేవాళ్ళు గ్రామీణ ప్రాంతంవారని, ఈ మధ్యతరగతి కొన్ని కష్టాలు అనుభవిస్తున్నారని అందరికీ తెలుసు. సమాజంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతం వారికివ్వాల్సిన వాటా ఇవ్వకపోవడంతో తిరుగుబాటుచేసే పరిస్థితులున్నాయి. కనుక బుజ్జగించడానికి ప్రభుత్వాలు రాయితీలు, ప్రకటించాయి. దీనికి లక్షల కోట్లు ఖర్చవుతున్నట్లు ప్రభుత్వం లెక్కల్లో చూపిస్తున్నా వారికి ఏ మేరకు అందుతున్నాయన్నది ముందుగా విశ్లేషిద్దాం.

ఈ రోజు జీవించాలంటే అత్యవసర వస్తువులైన బియ్యం, పప్పుదినుసులు, నూనెలు మొదలైన వస్తువులు ప్రభుత్వ చౌకధరల దుకాణాలల్లో కొనుక్కోవలసిన అవసరం ప్రజలందరికీ ఉంది. ఈ సదుపాయం గ్రామీణ ప్రాంతంలో సంవత్సరానికి ఆదాయం కుటుంబానికి రూ. 60,000/- లోపు ఉండాలి. ఏ కుటుంబమైతే కాల్వ క్రింద 1 1/2 ఎకరాల మాగాణిగాని, చెరువుల క్రింద 2 1/2 ఎకరాల మాగాణి కాని వ్యాపార పంటలకు పనికొచ్చే భూమి 3 ఎకరాలలోపుగాని తృణ ధాన్యాలు ఇతర మెట్ట వ్యవసాయానికి పనికి వచ్చే భూమి 5 ఎకరాలలోపుగాని కలిగి ఉన్న వారికే తెల్లరేషన్ కార్డులు జారీ చేయబడ్డాయి. అదే పట్టణ ప్రాంతాలలో అయితే కుటుంబ సంవత్సరం ఆదాయం రూ. 75,000/- లోపు ఉంటేనే తెల్ల కార్డులు ఇవ్వాలి. ప్రభుత్వ పౌరసరఫరాశాఖ ఈ నిబంధనలను రూపొందించినా గ్రామీణ ప్రాంతంలో యింకా కొంతమంది అర్హులకు తెల్లరేషన్ కార్డులు ఇవ్వడం జరగలేదు. ఐతే రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 1 కోటి 70 లక్షల కుటుంబాల వారికి తెల్ల రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందని చెబుతున్నారు. కుటుంబానికి ఐదుగురి చొప్పున 1 కోటి 70 లక్షల కుటుంబాల్లో 8.5 కోట్ల మంది ప్రజలు అంటే తెలుగుజాతి యావత్తు దారిద్ర్యరేఖకు దిగువన ఉందని ప్రభుత్వం ప్రకటిస్తోంది. ఇంకా తెల్లరేషన్ కార్డుకు అర్హత ఉండి పొందని వారు ఉన్నారని ఇటీవలే ముఖ్యమంత్రి ఇతర ప్రజాప్రతినిధులు నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో వెల్లడయింది. అంటే గ్రామీణ ప్రాంతంలో, పట్టణ ప్రాంతంలో ఉన్న ధనిక, మధ్యతరగతి వాళ్ళకు తెల్లరేషన్ కార్డు అర్హత లేకపోయినా అధికారుల ప్రజాప్రతినిధుల అండదండలతో పేదలకు చెందవలసిన సబ్సిడీని ఈ వర్గాలు కాజేస్తున్నాయని ఏ కొద్ది జ్ఞానమున్న వారికైనా అర్థమవుతుంది. దీనితో పాటు తెల్లరేషన్ కార్డుల వారందరికి ఆరోగ్యశ్రీ కార్డులు ఇచ్చి కార్పోరేట్ ఆస్పత్రులలో వైద్యం చేయించి ఆ ఖర్చును వేలకోట్లలో కార్పోరేట్ ఆసుపత్రులకు ప్రభుత్వం చెల్లిస్తోంది.

అలాగే ప్రభుత్వ వైద్యశాలలను అన్ని ప్రాంతాలకీ ప్రజలకు దగ్గరగా నిర్మించి ఉచిత వైద్యాన్ని అందజేయవల్సి ఉండగా పట్టణ ప్రాంతాలలోని ప్రైవేటు వైద్యశాలలకి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు దొంగబిల్లులతో సహా వేలకోట్లు చెల్లిస్తున్నాయి. అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు లేవని ప్రభుత్వం చేతులెత్తేస్తోంది.

### మరి మనమేం చెయ్యాలి?

ప్రజలకు ఉన్న హక్కులు, విధులు, తెలుసుకొని; మన విధులు నిర్వర్తిస్తూ హక్కులు కోసం ఉద్యమాలు చెయ్యాలి. ఉదాహరణకు అర్హులైన పేదవారు తెల్లకార్డు కోసం వెంటనే ధరఖాస్తు చేయ్యండి. 30 రోజుల్లోగా కార్డురాకపోతే సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ (6) ద్వారా రెవెన్యూ యంత్రాంగాన్ని అడగండి. అలాగే మన గ్రామాల్లో ఉన్న అనర్హులపేరు, ఇంటి చిరునామా, ఆస్తి, ఆదాయ వివరాలు వ్రాస్తూ వీలయితే కార్డు నెంబరుతో సహా వివరాలు పంపండి. ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి అనర్హులకు కార్డులు రద్దు చేయించి ప్రభుత్వ నిధులను రక్షించండి. ఇలాగే అనేక రంగాలలో ఈ రోజు అవినీతి ప్రజా జీవితంలో ప్రభుత్వ కార్యకలాపాల్లో దైనందిన భాగమైపోయి మన ప్రాంతాన్ని అభివృద్ధికి నోచుకోనివ్వటం లేదు అన్న విషయం నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వ విధుల్లో ప్రజా సంక్షేమానికి సంబంధించిన మొదటి 35 విధులను ప్రభుత్వం చెయ్యకపోయినా తరువాత అదే లిస్టులోని 31 అంశాల ద్వారా ప్రజలద్వారా ప్రజలమీద నానాటికి పన్నుల రూపేణా లక్షకోట్లు వసూలు చేస్తుంది. విచ్చలవిడి మద్యం సరఫరా ఒక ప్రక్క అపరిశుభ్ర వాతావరణం రెండో వైపు, వైద్యశాలలు లేకపోవడం, అన్నీ కల్సి మనందర్కి నిస్సహాయస్థితి కల్పించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా గ్రామాల్లో ప్రజలెదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించడానికి కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్నా, ప్రజల జీవితాలలో మౌలికమైన మార్పులు రాకుండా, రవాణా, విద్య, ఉపాధి రంగాలను నిర్లక్ష్యం చేస్తూ తమ కాళ్లమీద తాము నిలబడే శక్తిని ఇవ్వకుండా సబ్సిడీల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ, రేషన్‌కార్డులు, గ్రామీణ ఉపాధి హామీ పథకం, దీపం పథకం, గ్యాస్ సబ్సిడీలు తమకు అనుకూలంగా ఉన్న వారికి అందేటట్లు చేసి తద్వారా ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ప్రభుత్వం, రాజకీయ పార్టీలు పనిచేస్తున్నాయి. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు అనే మహాత్ముని ఉపదేశాన్ని పక్కనపెట్టి, చేతివృత్తులను, నాశనం చేస్తున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో కమ్మరి, కుమ్మరి, చేనేత, చాకలి, మంగలి తదితర చేతివృత్తుల వారు సన్నకారు రైతులు తమ వృత్తులను కోల్పోయి ఉపాధి వేటలో పట్టణాలలో రోజు కూలీలుగా మారిపోతున్నారు. రాజ్యాంగరీత్యా దళితులకు ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన పిల్లలు చదువుకునేందుకు నెలకొల్పిన చాలా విద్యాలయాలు, హాస్టళ్ళు అవినీతికి మారుపేరుగా విరాజిల్లుతున్నాయి. వేలాది మంది పిల్లలు విద్యను కొనలేక కేవలం 10వ తరగతి, ఇంటర్మీడియట్ స్థాయిలో తమ చదువులకు మంగళం పాడుతున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో మద్యం ఏరులై పారుతోంది.

ప్రభుత్వం వేరొక ప్రక్క కోట్లాది రూపాయలు సబ్‌ప్లాన్‌ల పేరుతో దళితులను ఉద్ధరించడానికి కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నట్టు ప్రకటనలు గుప్పిస్తున్నారు.

నిజంగా ఈ వందల కోట్లు ఖర్చు పెడుతుంటే ప్రజలలో ఇంకా 40% మంది దారిద్ర్యరేఖకు ఎందుకు దిగువనున్నారు? ఈ ఆశ్రిత పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య వ్యవస్థలో సంపన్న వర్గాలు పాలకులుగాను, ఇతర బడుగు బలహీన వర్గాలు పాలితులుగా ఎందుకు ఉంటున్నారు? నిజంగా మనది ప్రజాస్వామ్యమేనా?

మనది ప్రజాస్వామ్యమే, మాది అంతా పారదర్శకమే అని ప్రజలను నమ్మించడానికి 'కొత్తగా సమాచార హక్కు చట్టం' తీసుకువచ్చారు. చాలామంది మేధావులు ప్రజాస్వామికవాదులు ఈ చట్టం ద్వారా ప్రజలకు ఏదో కొంత మేలు చేయవచ్చని నమ్ముతున్నారు. వివిధ ప్రభుత్వ పథకాలు అమలు తీరును సమాచార హక్కు చట్టంద్వారా సేకరించడం, ముఖ్యంగా విద్య, వైద్యం, మొదలగు విషయాలు మీద దృష్టి కేంద్రీకరించి దళితులకు బలహీన వర్గాలకు, విద్య, వైద్యం అందించటానికి మార్గాలు అన్వేషించడం, ప్రభుత్వ ఆసుపత్రుల స్థాపన, అభివృద్ధి, రహదారులు అభివృద్ధి, త్రాగునీరు, సాగునీరు వంటి మౌలిక సదుపాయాలు సాధించాలి.

అసలు పూర్తి అవినీతిరహిత ప్రభుత్వం మరియు ప్రేమాభిమానాలతో నూతన మానవ సమాజాన్ని నిర్మించాలనే ఉద్దేశ్యంతో లోకవిద్యాజనాందోళన గత దశాబ్దంపైగా జ్ఞాన మీమాంస చేస్తోంది. పుట్టిన పిల్లలందరూ 10, 15 సం॥లలోపు ప్రాథమిక విద్యతోపాటు తల్లిదండ్రుల నుంచి బంధువుల నుంచి తమ కుటుంబ పరమైన వృత్తిలో జ్ఞానాన్ని సంపాదిస్తున్నారు. వీరు కుటుంబం నుంచి వచ్చిన జ్ఞానం సరియైన వేతనాన్ని ఇవ్వడం లేదనీ, ఈ జ్ఞానాన్ని ఆచరించే వాళ్ళందరూ వెనుకబడిన వారని ప్రభుత్వం ముద్రవేయడంతో ఉద్యోగాల్లో రాయితీలవైపు పరిగెట్టడం జరుగుతోంది. ఉన్నకొద్ది ఉద్యోగాలు అందరికీ సరిపోక తమకున్న జ్ఞానం ఎందుకు పనికిరాని స్థితిలో వీరు బందీలై వున్నారు. చేతివృత్తులు, వ్యవసాయ రంగాలు పూర్తిగా కొనుగోలు ధరల దాక్షిణ్యాల మీద ఆధారపడి వారికి కావల్సిన వైద్యం, విద్య, పారిశ్రామిక సరుకులు అమ్మేవాడు నిర్ణయించే ధరలు చెల్లించలేక ఈ రోజు భారత సమాజం అతలాకుతలానికి లోనవుతోంది. అన్నింటికి పాశ్చాత్య నమూనా అనారోగ్యాలు, ధరల పెరుగుదల, వ్యవసాయ, చేతివృత్తి ఉత్పత్తులకు గిట్టుబాటు రేటు దొరక్కపోవడం పైకి కన్పించే రుగ్మతలుగా తేలాయి. ఈ భయంకర పరిస్థితుల్లో చదువుకున్నవారనేకమంది ఈ రోజు 5-10 వేల రూపాయల జీతంతో కాంట్రాక్ట్ ఉద్యోగాలు చేస్తున్నారు.

అనిశ్చిత, రహస్యం, సమాచార లేమి అనివార్యంగా అవినీతికి దారితీస్తాయి. పారదర్శకత, ఖచ్చితత్వం, పూర్తి సమాచారం అవినీతిని అంతం చేస్తాయోమోకాని, సమానతను సాధ్యం చేయజాలవు. ఉత్పత్తి సాధనాల మీదఅధికారం, వస్తుధరల నిర్ణయంమీద అధికారం, ఎగుమతి దిగుమతులమీద ఆంక్షలు లేకపోవడం, పరిశ్రమల, విద్యాలయాల, వైద్యశాలల, ఇతర ఉత్పత్తి కేంద్రాలకు ఇచ్చే రాయితీల ద్వారా సంపద పోగుపడటం జరుగుతోంది. సమానత్వం కోసం రాయితీలు పేదవారికి అందజేయడంతో పాటు ఇతరులకు రద్దుచేయటం సమానత్వానికి మొదటిమెట్టు. సమసమాజ అభివృద్ధికి విద్య, వైద్యం, విద్యుత్, గనులు పూర్తిగా ప్రభుత్వం ఆధీనంలో ఉండటం అత్యవసరం.

మున్సిపాలిటిలో, త్రాగునీటి మరియు విద్యుత్ సరఫరా శాఖలలో, ఇంటిప్లాను మంజూరు నుంచి పన్ను మదింపు వరకూ ఉన్న అవినీతిని ఆపినంత మాత్రాన నూతన సమాజ ఆవిష్కరణ జరగదు. పారంపర్య జ్ఞానానికి సరైన వేతనాలనిచ్చి, వివిధ వర్గాల మధ్య వేతానాలలో వ్యత్యాసాలను అంతం చేసేదాకా ఈ పోరాటం సాగాలి.

- టి. నారాయణరావు

**జ్ఞానం ఏ ఒక్కరి సొత్తు కాదు. ఇతరులను దోచుకోవటానికి పనికొచ్చేది జ్ఞానం కాదు.**

# వేల సంవత్సరాల నుంచి వస్తున్న జ్ఞానాన్ని గౌరవించడం ద్వారానే కుల నిర్మూలన సాధించాలి.

భారతదేశంలో కులాలు ఎలా పుట్టాయి, ఎప్పుడు పుట్టాయి అన్నదానిపై ఎన్ని పరిశోధనలు జరిగినా వీటికి సరియైన సమాధానం ఈనాటికీ దొరకలేదు, కాని మన సమాజంలో ఒకే తరహా పనిచేసే వారికి ఒక కులముగా గుర్తింపు వున్నది అనునది అందరూ సాంఘికంగా ఆమోదిస్తున్న సత్యం. కాని ఈ కులాల్లో విభజింపబడ్డ అందరూ కలసి మన సమాజాన్ని అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నారన్నది కూడా అంతే సత్యం. ఆఖరికి మన దైనందిన జీవితంలో మనం గమనించే దున్నటం దగ్గర్నుంచి, విత్తటం దగ్గర్నుంచి. పంటలను పంచుకోవటం దగ్గర్నుంచి, పుట్టుకల్లో, చావుల్లో, పండగల్లో, జాతరల్లో, పెళ్ళిళ్లల్లో ప్రతి సామాజిక కార్యక్రమాల్లో అన్ని కులాల వారికి వారు చేయవలసిన పనులు, పంటలలో వారికి ఇవ్వాల్సిన వాటా ఈరోజు కూడా గమనించవచ్చు. కాని ఏ కారణాల వల్లనో సామాజిక అభివృద్ధిలో స్థానం కలిగిన దళితులు, ఇతర అస్పృశ్యులు ఏదో ఒక కాలంలో గ్రామానికి దూరంగా పెట్టి నిస్సహాయ స్థితిలోకి, ఆర్థికంగా దారిద్ర్యంలోకి తోసేసినా, వారు కూడా సమాజంలో వారి విధులు నిర్వర్తిస్తూ కొంత ప్రతిఫలం పొందుతూ అట్టడుగు వర్గంగా గుర్తింపబడినప్పటికీ సమాజంలో ఘర్షణలు, ఉద్రిక్తతలు విశృంఖలంగా వలసవాదుల రాకముందు లేవనే చెప్పాలి.

ఈ నేపథ్యంలో ఐరోపా ఖండం నుంచి వ్యాపారం మిషతో భారతదేశంలోకి ప్రవేశించిన వలసవాదులు నాటి సామాజిక పరిస్థితులను అధ్యయనం చేసి అందర్ని కలుపుకుపోయే పేరుతో ఆంగ్ల భాషను ప్రవేశపెట్టి ముందుగా వున్నత వర్గాల వార్నీ తరువాత రిజర్వేషన్ పేరుతో అట్టడుగు వర్గాల వారికి రాయతీలిస్తూ తమ సామ్రాజ్యాన్ని సుస్థిరం చేసుకున్నారు. నాటి చతుర్వర్ణ (బ్రహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర) విభజన సమాజాన్ని చీలుస్తోందనీ; కలుపుకు పోయే అభివృద్ధిలో తమ సాంకేతికత ప్రవేశపెట్టే మిషతో చివరగా గుత్తాధిపత్యం కోసం కొత్త వలసవాద కుల విభజనను ప్రవేశపెట్టారు. వారు చెప్పిన అభివృద్ధిని ఆచరించేవారు ముందు తరగతి వారుగాను, నాటికి సమాజంలో విస్తృతంగా భారతీయులు ఆశ్రయించే అభివృద్ధి పథంలో ఉన్న వృత్తులన్నీ వెనకబడిన వాటిగా సూత్రీకరించారు. దీనిలో వున్న కుహనా అభివృద్ధి పద్ధతి ఏమిటంటే విశాల భారతదేశంలో వున్న కుల వృత్తులతో సహా జీవ వైవిధ్యంతో కూడిన స్థానిక వ్యవసాయ పద్ధతులను ఆచరించే వారినందరినీ వెనుకబడిన వారి పేరుతో సమాజంలో వృత్తి దారులందరూ తమ వృత్తి వెనకబడిందని, దానిని ఛీత్కరించుకుంటూ నిరాశా, నిస్పృహలతో దానిని వదిలి కొత్త వృత్తులు స్వీకరించి అభివృద్ధి చెందిన వృత్తులలో ప్రవేశించాలని ఆత్మన్యూనతా మనస్తత్వం అలవరచుకున్నారు. అందుకే ఉద్యోగాల్లో కేటాయింపులు, రాయితీలు, ఉపకార వేతనాలు కావాలని ఈరోజుల్లో పెద్ద యెత్తున ఆందోళనలు కుల ప్రాతిపదికగా జరగడం చూస్తున్నాం. చివరగా ఈ వర్గాల ఓట్లతో నెగ్గిన ప్రజాప్రతినిధులు కూడా రాజ్యాంగ బద్ధంగా సమాజాన్ని ఎస్సీ, ఎస్టీ, బి.సి., ఓ.సి. అనే కొత్త చాతుర్వర్ణ వ్యవస్థను ప్రవేశపెట్టడం జరిగింది. ఇది కుల నిర్మూలనకు బదులు కుల పటిష్టతకు దారి తీసింది. వలస వాదులు ప్రవేశపెట్టిన సామాజిక విభజనను మన కొత్త ప్రజాప్రతినిధులు రాజ్యాంగ బద్దంగా సామాజిక విభజనను పూర్తి చేశారు.

ఈ కొత్త విభజన గ్రామీణ ప్రాంతంలో ఉన్న పారంపర్య వృత్తిదారులతో పాటు సంతలు, కిరాణా దుకాణాలు, చిన్న మరియు కుటీర పరిశ్రమల వారు మరియు తోపుడబండ్ల వారు ఆఖరుకు గృహిణులు కూడా తాము చేసే పని ఏహ్యామైనదని అభివృద్ధి చెందాలంటే పారిశ్రామీకికరణ, యాంత్రీకరణ, ప్రపంచీకరణ వ్యక్తిగత సంపద సమీకరణ మాత్రమే అభివృద్ధి సూచిక అని నమ్మే దుస్థితి ఈరోజు వచ్చింది. లోకవిద్య సమాజంలో ఉన్న అశేష ప్రజానీకం వారు ఆచరిస్తున్న వృత్తుల ద్వారా ఉత్పత్తులు, సేవలకు సరియైన పారితోషికం చెల్లించి ఆర్థికంగా పరిపుష్ఠం చేసి, వారి జ్ఞానాన్ని వృద్ధి చేసుకొనే సమాజంలో ఘర్షణలు లేని కలుపుకుపోయే సమసమాజాన్ని నిర్మించాల్సిన అవసరాన్ని ఈరోజు సమాజాభివృద్ధి కాంక్షించే ప్రతి భారతీయుడు అవగాహన చేసుకోవాలని లోకవిద్యాధర సమాజం కోరుతోంది. ఈ సమసమాజంలో ప్రతి ఒక్కరి జ్ఞానం మరియు వారి నైపుణ్యతకు తరగతుల వారి విభజన లేకుండా సమాన ప్రాతిపదికన పారితోషికం లభించాలి.

ప్రపంచ వ్యాప్తంగా పోయిన శతాబ్ద కాలంలోని రాజకీయ విముక్తి పోరాటాలను గమనిస్తే అవన్నీ కూడా ఆర్థిక సమానత్వంను దృష్టిలో పెట్టుకుని నిర్వహింపబడ్డాయని ఎవరైనా గమనించవచ్చు. అంటే ఆర్థిక సమానత్వం తోటే సమాజంలోని అన్ని వర్గాలకు సామాజిక సమానత్వం వస్తుందని ప్రచారం పెద్దఎత్తున జరిగింది. అంటే ఒక రైతు భూస్వామిగా మారితే, ఒక కమ్మరి పారిశ్రామిక వేత్తగా మారితే, ఒక శిల్పి బొమ్మల తయారుచేసే పరిశ్రమ స్థాపిస్తే, ఒక స్త్రీ తయారి పరిశ్రమ స్థాపిస్తే, ఒక కూలి మేస్త్రీగా లేదా కాంట్రాక్టరుగా మారితే. ఒక ఉద్యోగి ఫ్యాక్టరీ అధిపతిగా మారితే, ఒక విద్యాదికుడికి ప్రభుత్వ ఉద్యోగం వస్తే వారంతా కూడా వారికింద వేలమందిని కూలీలుగా, పనివారుగా, శిల్పులుగా లేదా మరోవృత్తి చేయటానికి వినియోగించుకోవటంతో వీరంతా ఒక పాలక వర్గంగా రాజకీయ అధికారాన్ని పొంది ఆర్థికాంశాలను శాసించే స్థితికి ఎదుగుతున్నారు. వీరు తమ రాజకీయ అధికారం కోసం సబ్సిడీల పేరుతో డబ్బును, సంక్షేమ పథకం పేరుతో టెలివిజన్‌లు, గ్యాస్‌స్టౌలు చివరగా దారిద్ర్యరేఖకు దిగువన వున్న వారికి తిండినీ రాయితీలు ఇస్తూ మొత్తం జాతినే బిచ్చగాళ్ళుగా తయారు చేస్తున్నారు. ఈ పద్ధతుల వల్ల అసమానతలు తగ్గకపోగా పరిస్థితి ఎంత దారుణంగా తయారయ్యిందంటే మాకు కూడా ఈ రాయితీలో భాగం కావాలనే ఉద్యమాలు పెరిగిపోతున్నాయి. మొత్తం సమాజాన్ని మార్చే పద్ధతిని అధ్యయనం చేయకుండా ఈ రోజు అన్ని కులాలవారు రాయితీలకు ఎగబడటం అందరం గమనించవచ్చు. తమ వృత్తి మీద తమకే గౌరవం పోవటం, తమ మీద తావే జాలిపడాల్సి రావటం, అభివృద్ధిలో భాగస్వామ్యం లేదనే భావన ఎన్నడూ లేనంతగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో సామాజిక మార్పు సమానత్వం వైపు ప్రయాణించే అభివృద్ధి ఎలా జరగాలనే విశ్లేషణ అత్యంత ముఖ్యమైనది. ఈ రోజు జరుగుచున్న రాయితీ రాజకీయాలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ, ఆర్థికవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు ప్రపంచ వ్యాప్తంగా మద్దతు పలకడానికి ముఖ్యకారణం పెట్టుబడి ప్రపంచీకరణ చెందటమే. అంటే ఈ ఆర్థిక వాదనలో మానవత్వపు విలువలు మంటగలసి వ్యక్తిగత లాభాలు పెంచుకునే ఆర్థిక సమానత్వము అనే మార్గం ప్రస్తుత పద్ధతిలో విఫలమైందనీ దీనికి ప్రత్యామ్నాయం సామాజిక సమైక్యతా భావం సాధించే మార్గాన్ని అవలంభించటమేనని సూచన ప్రాయంగా తెలుస్తుంది. ఆర్థిక సమానత్వానికి ప్రస్తుత అభివృద్ధి నమూనాలు, ప్రణాళికలు అమలులో వున్న తాత్కాలిక ఆర్థిక చర్యలు నిరాశావాదం వైపు నెట్టివేయడానికి ప్రధాన కారణం; ఈ క్రొత్త సాంకేతిక పరిజ్ఞానం ప్రాపంచీకరణ వైపు వ్యక్తిగత సంపాదన వైపు దారి చూపటమే.

అందుచేతనే ఆర్థిక సమానత్వాల కన్నా ముందు సాంఘిక సమానత్వాన్ని తీసుకురావటమే సమాజ లక్షణంగా మారాలి. ప్రస్తుతం మనకున్న చారిత్రక పరిజ్ఞానం సమాజంలోని ఉత్పత్తి చేసే అందరి వృత్తులలో తేడాలు లేవనే గుర్తింపు. ఇది ప్రభుత్వాన్ని యాచించే కోర్కెగా ఉండరాదు. ఈ సమాజంలోని ప్రతివర్గం వారు చేయవలసిన పనినీ, ప్రభుత్వం చట్టాలను, పరిపాలన కోసం ఏవిధంగా కాగితాల మీద సూత్రీకరిస్తుందో ఈ సమాజం అన్ని వృత్తుల వారికి సమాన స్థానం ఇవ్వడానికి చేసే నిర్ణయాలు కూడా అంతే గౌరవం కలిగిన చట్టంగా సమాజం భావించాలి.

దీనికోసం ఈ క్రింది మూడు ప్రత్యామ్నాయాలు ఎంత కష్టమైనా ఆచరణలో పెట్టగలిగే ధైర్యంతో సత్యాన్వేషణకు దిగితే మార్గం సుగమం అవుతుంది.

**1. పుట్టుకతో నిర్ధారించే ప్రభుత్వం ఇచ్చే కుల నిర్ధారణ పత్రాలను ఆపాలి. నేటి కులపత్రాలు ఒక పద్ధతిలో కుల వ్యవస్థను పటిష్ట పరుస్తున్నాయి.**

దీనిస్థానంలో తల్లిదండ్రుల పేర్లు వారి కులాన్ని నమోదు చేయాలి. తండ్రి పేరుస్థానే తల్లి పేరును ప్రతీ ప్రభుత్వ రికార్డులలోనూ వ్రాయడం జరగాలి. 12 లేదా 14 సం॥ల వరకు బాలబాలికలకు అందరికి ఒకేచోట చదువు చెప్పే పద్ధతిని అమలుచేసి తర్వాత బాలబాలికలకు ప్రత్యేక విద్యా విధానాన్ని పాటించాలి. ఆ సమయంలో కుల ప్రస్తావన వుండరాదు. ఆతర్వాత నుండి వ్యక్తిగతంగా బాలుడు/బాలిక తన యొక్క వృత్తిని ఎంచుకొని ఆవృత్తికి గల సౌకర్యాలను ఎవరైనా వినియోగించుకోవచ్చు. అలా రిజర్వేషన్లు వినియోగించుకోవాలని ఎవరిని ఎటువంటి వత్తిడి తేరాదు.

యువతీ, యువకులుగా పిల్లలు వృద్ధిచెందిన తరువాత వివాహ సమయంలో వధూవరులు తమ వృత్తిని చివరగా స్వీకరించి ఆవృత్తికారులకు వున్న సౌకర్యాలను వినియోగించుకోవచ్చు. సామాజిక విద్య, వైద్యసదుపాయం, అందరికి ఉచితంగా అందుబాటులో వుండాలి. ఎవరైనా ఆ వృత్తికారులకిచ్చే సౌకర్యాలను అనుభవించాలని ఎటువంటి వత్తిడి ఉండరాదు.

చివరగా వార్ధక్యంలో ఏ పనీ చేయలేని వృద్ధులంతా తమ నమ్మకాలననుసరించి జీవించే హక్కు కలిగి వుండడం ఏ కులం వారితోనైనా జీవించే హక్కు, ఆకులానికి చెందిన వారికిచ్చే వైద్య, పింఛన్ లేదా మరేవిధమయిన రాయితీలనయినా పొందే హక్కు వుండాలి. దానిననుభవించి తీరాలనే నిబంధన ఏదీ వుండరాదు.

**2) ప్రస్తుత రాజకీయ అభివృద్ధి నమూనాలో, కులాల్లోనే స్త్రీలను ప్రత్యేక తరగతిగా గుర్తించటంగా జరగడాన్ని ఆపాలి.**

ప్రధాన సూత్రం ప్రకారం పిల్లలందరికి 12, 14 సం॥ల దాకా లింగభేదం లేకుండా ఒకేచోట చదువు అందరికి చెప్పాలనే నిబంధన వల్ల వారి మధ్య ప్రజాస్వామ్య సంస్కృతి, సమానత్వం విరజిల్లడం గత అనుభవంలోని విషయమే. దాని తర్వాత యవ్వనదశలోకి వచ్చే ఆడపిల్లలు తమ జీవితంలో ఏ వృత్తిని స్వీకరించాలనేది వారి ఇష్టానికి వదిలేయాలి. ఆవృత్తిలో వున్నవారికిచ్చే రాయితీలన్నీ అనుభవించే హక్కు కలిగి వుండాలి. తనకి నచ్చిన వరుణ్ణి చేసుకునే స్వాతంత్ర్యం కలిగి వుండాలి. ప్రస్తుతం సాంఘిక భద్రత కోసము, పౌష్టికాహారం కోసం, వైద్య సదుపాయం కోసం ఇచ్చే రాయితీలన్నీ అందరిబాలికలకు వర్తింపచేయాలి. పిల్లలకు ఎలాగైతే కులాలు లేకుండా పెంచుతారో అలాగే స్త్రీలు కూడా ఏ పురుషుడ్ని అయినా పెళ్ళి చేసుకుని పిల్లల్ని కనడానికి అర్హురాలనీ గుర్తిస్తే స్త్రీలకు కూడా ఏ కులాన్ని ఆపాదించలేం. అంటే పిల్లలకు, స్త్రీలకు ఏ కులాన్ని ఆపాదించకూడదు. అంటే ఈ 3 సూత్రాల ద్వారానే సామాజిక న్యాయం జరిగే అవకాశముంది. మొత్తం వ్యవస్థలోనే దామాషాలో స్త్రీల ప్రాతినిధ్యం అమలుజరపాలి.

**3. ఆస్థిపై వంశపారంపర్య హక్కు రద్దు చెయ్యాలి.** ప్రస్తుతం అమలులో వున్న ఆస్థి వారసత్వ చట్టాలను సమూలంగా మార్పు చెయ్యవలసిన అవసరం ఎంతైన వుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతీ సమాజంలోనూ సహజంగా ప్రకృతిని అందరం కల్సి అనుభవించడం స్థానే ఒక దశలో, వ్యక్తిగత ఆస్థికి దారితీసింది. ఏ సమాజంలోనయినా జ్ఞానం, ఆస్తి పుట్టుకతోరావు. ఇవి పుట్టిన తరువాత వస్తాయనే సత్యాన్ని ముందు గుర్తించాలి. పైన చెప్పిన రెండు సూత్రీకరణలతో బాలబాలికలు, స్త్రీలు ఏ కులానికి చెందిన వారుకారనే సత్యంతో పాటు ఆస్థిపై కూడా ఏ ఏకైక వ్యక్తికి సంబంధించిందికాదనే సత్యాన్ని ముందుగా మనం గుర్తించాలి.

లోకవిద్య సమాజంలోని ప్రతీవృత్తికారుడు తన జ్ఞానాన్నుపయోగించి ఉత్పత్తి చేసే పంట, వస్తువు, సేవలకు సమానవేతనం పొందే జీవనాన్ని రాజ్యాంగంలోనే ప్రాథమిక హక్కుగా గుర్తించాలి. వీరందరికీ నూతన ఆధునిక జ్ఞానం ద్వారా సంపాదించుకొనే వేతనాలకు లోకవిద్యాధరుల వేతనాలకు మధ్య ఎటువంటి వ్యత్యాసం వుండరాదు. ఇప్పుడు ప్రశ్న లోకవిద్యాధర సమాజంలో వున్న చేతివృత్తుల వారు, రైతులు తమ జ్ఞానాన్ని కూడా ఆధునిక జ్ఞానమన్నంత గొప్పదని దానితో సమానమైన వేతనాలు సంపాదించుకోవటానికి అర్హులమనే విశ్వాసం కల్పించడమే ఈ వ్యాస ప్రయత్నం. ఇటువంటి కోర్కెను తీర్చమని ప్రభుత్వాన్ని అడగడం కన్నా ఈ సమాజంలోనే వున్న లోకవిద్యాధరులు తమ జ్ఞానంమీద విశ్వాసం కలిగి వుండడం ముఖ్యం. సాటి లోకవిద్యాధరుడి జ్ఞానానికి సరైన వేతనం చెల్లించటం ద్వారానే తాము కూడా దానికి అర్హులవుతామని ఇతరులు గుర్తించాలి.

ఇప్పటిదాకా అప్రతిహతంగా జరుగుతున్న ప్రస్తుత దోపిడి సమాజ స్థానే పై సూత్రాలను ప్రవేశపెట్టిన వెంటనే మన సమాజం కొద్దికాలం అతలాకుతలమైనా అంతిమంగా సమానత్వానికి దారితీనస్తుంది. ఈ రోజుదాకా ఉన్న పరిపాలన చేసే చట్టపరిధిలోనూ మార్పురావాలని ఇటువంటి నూతన సమాజ నిర్మాణం జరగాలనే సత్యాగ్రహులు రాజ్యాంగాన్ని మార్చే వరకు మనదేశంలో సామాజిక న్యాయం సాధ్యంకాదు.

**డా॥ సురేంద్రన్, డా॥ క్రిష్ణంరాజులు**

**గమనిక :** ఈ వ్యాసంపై వివిధ వ్యక్తుల నుండి, సంస్థలనుండి, సామాజిక కార్యకర్తలనుండి చర్చల్లో పాల్గొనవలసిందిగా లోకవిద్యా ప్రపంచం కోరుతోంది. వీటిని వీలునుబట్టి రాబోయే సంచికలలో ప్రచురిస్తాం.

## భారత్-జపాన్ అణు ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శన

జపాన్ ప్రధాని షిన్‌జో అబి రిపబ్లిక్‌డే సందర్భంగా భారత సందర్శనలో ఫుకుషిమా తరహా అణు యంత్రాలను సహాయం, అభివృద్ధి పేరుతో మనకు అంటగట్టే అక్రమ ఒప్పందాన్ని ఎండగడ్తూ జాతీయ ప్రజాఉద్యమాల ఐక్య సంఘటన (ఎన్.ఎ.పి.ఎమ్) లోకవిద్యజనాందోళన కార్యకర్తలు 15 మంది ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద 25-1-14 సాయంత్రం 5 గం॥ భారత్-జపాన్ అణు వప్పందాలను వ్యతిరేకించండి అనే ప్లేకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా॥బాబూరావ్, టి.నారాయణరావులు పాల్గొన్నారు.

**- లోకవిద్యా ప్రతినిధి**

**జ్ఞానం సమాజంలోనుంచే ఉద్భవిస్తుంది.**

## ఆమ్‌ఆద్మి పార్టీ ఎడల లోకవిద్య జనాందోళన అవగాహనపై సమావేశం

లోకవిద్యాజనాందోళన వారణాసి విద్యాశ్రమం కేంద్రంగా లోకవిద్య జ్ఞానం ఆధారంగా దేశంలో ప్రత్యామ్నాయ ఆర్థిక నమూనా కోసం ప్రచారం చేస్తోంది. స్థానిక ప్రజల పరిపాలన వారే చేసుకోవాలనీ పరిపాలన ప్రజల ఆధిపత్యం జీవితంలోని అన్ని రంగాలను సృజించాలనీ ఉత్పత్తి, పంపకం, నివాసంలలో సమానత్వం కొరకు చట్టాలు అమలు చేయాలి. ప్రస్తుత ఆర్థిక నమూనా ప్రజల ఉపాధిని, వనరులను విధ్వంసం చేస్తున్నదని, స్థానిక ప్రజల జ్ఞానం ఆధారంగా ఉత్పత్తి మార్కెట్ జరగాలని భావిస్తున్నాం.

లోకవిద్య జనాందోళన ఆంధ్రప్రదేశ్ విభాగం జనవరి 2012 నుండి లోకవిద్యా ప్రపంచం పత్రిక 1000 పత్రికల చొప్పున ప్రచురిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 16 సంచికలు తేవడం జరిగింది. పత్రికలో వచ్చిన వివిధ అంశాలపై అభిప్రాయ సేకరణలో భాగంగా 22-1-2014న హైదరాబాద్‌లో శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయంలో ఆమ్‌ఆద్మి పార్టీ- లోకవిద్యజనాందోళన అవగాహనపై సమావేశం నిర్వహించడం జరిగింది. ప్రస్తుత సంక్షోభం పరిష్కారానికి ఈ క్రింది పరిష్కారాలను లోకవిద్య జనాందోళన అవగాహనగా ప్రతిపాదిస్తున్నాం అని వివరించడం జరిగింది.

- రసాయనిక ఎరువులు, హైబ్రీడ్ విత్తనాలు, అధిక నీటిపై ఆధారపడే పంటలు కాకుండా, స్థానికంగా అభివృద్ధి చేసిన విత్తనాలు, ప్రజల ఆరోగ్యం అభివృద్ధి కొరకు పోషకాహారం, తృణధాన్యాలు, సాంప్రదాయ వర్మీకంపోస్టు, పశువుల పెంట ద్వారా అధిక ఉత్పత్తి చేయాలని కోరుతున్నాం.
- ప్రస్తుత పారిశ్రామికాభివృద్ధి గ్రామీణ ప్రాంతాలలో కుటీర పరిశ్రమలను దెబ్బతీసేదిగా వుందని, వ్యవసాయాధార పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడే పారిశ్రామిక అభివృద్ధిని అమలుచేయడం ద్వారా 120 కోట్ల జనాభాకు ఉపాధి లభిస్తుంది.
- స్థానిక ప్రజలు ఉత్పత్తిచేసే వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని, బహుళజాతి సంస్థల ఉత్పత్తులను బహిష్కరించాలని, స్థానిక ఆర్థిక వ్యవస్థలను పటిష్టం చేయాలని కోరుతున్నాం.
- విద్యుత్ ఉత్పత్తి, వినియోగం పూర్తిగా ప్రభుత్వరంగంలోనే చేయాలని గ్రామీణ, పట్టణ ప్రాంతాలన్నింటా సమానంగా విద్యుత్ సరఫరా చేయాలని, సోలార్, బయో, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రైవేట్ రంగంలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలని కోరుతున్నాం.
- బడ్జెట్ కేటాయింపులలో ప్రధానభాగం చిన్న నీటిపారుదలరంగం, చేనేత వృత్తులు, ప్రజారోగ్యం, విద్యకు కేటాయించాలని, ప్రైవేట్ విద్యా సంస్థలు, కార్పోరేట్ ఆస్పత్రులకు అన్ని రకాల సబ్సిడీలను నిలిపివేయాలి.
- అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో విమానాశ్రయాలు, న్యూక్లియర్, థర్మల్‌కేంద్రాలు, సెజ్‌ల పేరుతో వ్యవసాయ భూములను నిర్బంధంగా సేకరించకూడదని, అభివృద్ధిలో స్థానిక ప్రజల భాగస్వామ్యం వుండాలని ప్రజలకు తోడ్పడని అభివృద్ధిని తిరస్కరించాలని కోరుతున్నాం.
- నదులు, వాగులలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని, అన్ని రకాల భూగర్భ నీటివనరులను పరిరక్షించుకోవాలని పరిమితికిమించి ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని కోరుతున్నాం.
- గ్రామీణ ప్రాంతాలలో పొదుపులు గ్రామీణ ప్రాంతాలలోనే పెట్టుబడిగా పెట్టాలని, తక్కువ వడ్డీతో కుటీర పరిశ్రమలకు వినియోగించాలి.
- ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమైన జన్యుమార్పిడి ఆహార ఉత్పత్తుల ప్రవేశాన్ని వినియోగాన్ని, మంచినీటి అమ్మకం, శీతల పానీయాలను నిలిపివేయాలి. అందరికి ఉచితంగా మంచినీరు, ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలోనే అందించాలని కోరుతున్నాం.

ఈ అవగాహనతో ఆమ్‌ఆద్మీ పార్టీ పరిణామాలను పరిశీలించాలని, విధ్వంసకర, అవినీతి అభివృద్ధి నమూనాను తిరస్కరించాలని లోకవిద్యాజనాందోళన అవగాహనను వివరించడం జరిగింది. లోకవిద్యప్రపంచం పత్రికపై అనేకమంది సభ్యులు సూచనలు చేశారు. వివిధ రంగాలలో ప్రధానంగా వ్యవసాయంలో ఆధునికత పేరుతో కొనసాగుతున్న ఎరువులు, రసాయనిక ఎరువులు, యంత్రాలపై ఆధారపడిన విధానం ప్రధానంగా వుందని దీనిపై మన అవగాహనను విస్తృతంగా జనంలోకి తీసుకెళ్ళాలని, పత్రికపై తరచుగా అన్ని ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించాలని కోరారు. 15 మంది సభ్యులు హాజరయ్యారు.

ఫిబ్రవరి 22వ తేదీ మరల 2వ సమావేశంలో కులం సమస్యపై లోకవిద్య అవగాహనపై ప్రొ॥ కృష్ణరాజులు గారు ప్రసంగిస్తారని, తెలియజేయడం జరిగింది.

**- లోకవిద్యా ప్రతినిధి**

**విద్య అంటే సమాజంలో అసమానతలను తొలగించేది.**

## 30-1-2014న చీరాల నుండి హైదరాబాద్ వరకు 20 మంది చేనేత జన సమాఖ్య నాయకులు, కార్యకర్తలు 360 కి.మీ. 14 రోజుల పాదయాత్రను జయప్రదం చేయండి.

చేనేత డిమాండ్లను రాజకీయపార్టీల ఎన్నికల మానిపెస్టోలో చేర్చమని వత్తిడి చేయండి.

దేశంలో రిటైల్ రంగంలో బహుళజాతి కంపెనీలను ఆహ్వానించడం ద్వారా దేశీయ మార్కెట్ రోజు రోజుకు కుచించుకుపోతున్నది. చేనేతరంగంలో ప్రాణాధారమైన చిలపలనూలు, సిల్క్, జరీ నూలు ధరలు పెంచడం వలన చేనేత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. చేనేత వ్యతిరేక విధానాలలో భాగంగా మగ్గానికి యంత్రాలను అమర్చి, మిల్లు రంగం ఉత్పత్తులను చేనేత పేరుతో చలామణి చేసే కుట్రకు పాలకులు శ్రీకారం చుట్టారు.

2014లో జరిగే ఎన్నికల్లో చేనేత రంగంలో ఈ క్రింది డిమాండ్లను రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మానిపెస్టోలో చేర్చాలని మనమంతా సంఘటితంగా, వివిధ రూపాలలో, ఉద్యమాల ద్వారా రాజకీయ పార్టీలపై వత్తిడి తీసుకురావాలని ఈ పాదయాత్ర ద్వారా రాష్ట్ర చేనేత జన సమాఖ్య చేనేత వృత్తిదారులుకు విజ్ఞప్తి చేస్తోంది.

1) 1985 చేనేత రిజర్వేషన్ చట్టం ప్రకారం 11 రకాల రిజర్వేషన్లను యధాతధంగా అమలుచేయాలని, రిజర్వేషన్లను ఉల్లంఘించిన మిల్లు యజమానులపై 1973 క్రిమినల్ ప్రొసీజర్ చట్టం ప్రకారం ఎఫ్.ఆర్.ఐ. నమోదు చేసే అధికారం గ్రామ పంచాయితీలకు, చేనేత శాఖ అధికారులకు ఇవ్వాలి.
2) చేనేత ప్రధాన కేంద్రాలలో ఉత్పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతీ ఏటా 300 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలి.
3) చిలపలనూలు, సిల్కు, జరీ నూలును సరసమైన ధరలకు సరఫరా చేయాలి.
4) చేతి వృత్తిదారులు మరియు సేవా కులాల సంక్షేమం కోసం 500 కోట్లకు కేటాయించాలి.

లోకవిద్యా జనాందోళన చేనేత జన సమాఖ్య పాదయాత్రకు సంఘీభావంగా పాదయాత్ర ప్రారంభోత్సవంలో పాల్గొని పాదయాత్రను జయప్రదం చేయాలని లోకవిద్యజనాందోళన ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

**- లోకవిద్యజనాందోళన**

## జనవరి 11-12 తేదీలలో మధ్యప్రదేశ్, బైతుల్ జిల్లా ముల్తాయ్‌లో జయప్రదమైన లోకవిద్యజనాందోళన సదస్సు మరియు రైతాంగ అమరవీరుల స్మృతి సభ

జనవరి 11న 2014 లోకవిద్యజనాందోళన ముల్తాయ్‌లో సదస్సు జరిగింది. ఈ సదస్సులో రైతాంగ పోరాటాలతో మమేకమై జ్ఞాన సిద్ధాంతం ఆధారంగా లోకవిద్యాధర సమాజం తన సమస్యల పరిష్కారం కోసం పోరాడే రైతులతో చేయి కలిపింది.

ఈ సదస్సుకు ఇండోర్, నాగపూర్, వారణాసి, సింగ్రౌలి, ముల్తాయ్, ఆంధ్రప్రదేశ్‌ల నుండి 150 మంది ప్రతినిధులు హాజరయ్యారు. లోకవిద్య కళాకారుల సత్సంగ్ కబీర్ గాయకులు వారణాసి, ఇండోర్ నుండి పాల్గొని సభకు స్ఫూర్తి నిచ్చారు. సునీల్ సహస్రబుద్ధే, డా॥ సునీలం, కృష్ణతాక్రే, సంజీవ్‌దాజి, అవదేశ్‌కుమార్, లక్షీచంద్‌దూబే, డా। గిరీష్ సహస్రబుద్ధే, విలాన్‌బోనగేడ్, డా.బి. కృష్ణంరాజులు, మోహనరావు, నారాయణరావు, దిలీప్‌కుమార్, లక్ష్మణ్‌ప్రసాద్, సురేష్‌యాదవ్, ఎన్‌సాన్‌అలీ మరియు డా॥ చిత్రా సహస్రబుద్ధే కింది ఏజండాపై విపులంగా చర్చించారు.

1. దేశంలో లోకవిద్యాధర సమాజం జ్ఞానం ఆధారంగా వివిధ శక్తులు చేసే పోరాటాల్లో సమన్వయం చేస్తూ పోరాడే ప్రజలమధ్య ఐక్యత కోసం కృషి చేయడం.
2. లోకవిద్యజనాందోళన దేశంలో సింగ్రౌలి, ఇండోర్, వారణాసి, నాగపూర్, ఆంధ్రప్రదేశ్‌లలో లోకవిద్యాజనాందోళన కార్యకలాపాల్లో ముల్తాయ్ రైతుల పోరాట స్ఫూర్తిని అందించడం.
3. లోకవిద్య తాత్వికత ఆధారంగా ఈనాటి సవాళ్ళకు పరిష్కారాలు ముందుపెట్టడం.

ఈ సందర్భంగా లోకవిద్యాజనాందోళన కరపత్రం, పుస్తకం ప్రచురించింది.

- లోకవిద్య ఆధారంగా ఉపాధిపొందడం ప్రతీ ఒక్కరి జన్మహక్కు. అభివృద్ధి పేరుతో ప్రజల ఆస్తుల్ని, భూముల్నించి తొలగించడం వెంటనే ఆపాలి.
- ప్రపంచంలో వారసత్వంగా వున్న జ్ఞానం పూర్తిగా అసమానతతో వుంది. ఆధునిక మానవుడు పొందుతున్న వేతనంతో సమానంగా లోకవిద్య వున్న ప్రతీ ఒక్కరికి లభించాల్సిందే.
- స్థానిక సమాజాలకు పరిపాలనపై, మార్కెట్ వనరులపై పూర్తి అధికారం వుండాలి.
- స్థానిక భాషలో పాఠశాలను ప్రతీ గ్రామంలో నెలకొల్పాలి. నూతన యువతను లోకవిద్య జ్ఞానం ఆధారంగా తమ సమస్యలను తెలియచెప్పేందుకు లోకవిద్యజనాందోళన కృషి చేస్తుంది.

తుది సమావేశంలో కిసాన్ సంఘర్ష సమితి హాజరై పైన పేర్కొన్న 5 డిమాండ్లపై దేశవ్యాప్తంగా లోకవిద్య ఆధారంగా సంఘ నిర్మాణం చేయాలని రైతులు, ఆదివాసీలు, చేతివృత్తులవారు, స్త్రీలు, చిన్నవ్యాపారస్తులను సంఘటితం చేయాలని తీర్మానించారు. మధ్యప్రదేశ్ లోకవిద్య జనాందోళన కార్యకర్తలు కిసాన్ సంఘర్ష సమితితో కలిసి పనిచేసినట్లు ఆంధ్రప్రదేశ్‌లో, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ మరియు ఢిల్లీలో వివిధ సంఘాలతో సదస్సులు నిర్వహించాలని తీర్మానించింది.

రైతాంగ అమరవీరులకు నివాళి

1998 జనవరి 12న మద్దతు ధరలపై ఆందోళన చేసిన రైతులపై మధ్యప్రదేశ్ ముల్తాయ్‌లో 24మంది రైతులను ప్రభుత్వం దుర్మార్గంగా కాల్చి చంపింది. కాంగ్రెస్ పాలకుల దుర్మార్గాన్ని నిరసిస్తూ ప్రతీ సం॥ జనవరి 12న రైతుల ప్రదర్శన, సభ జరుగుతోంది. 2014 జనవరి 12న ముల్తాయ్ బస్టాండ్ వద్ద అమరవీరుల స్మారక స్థూపం వద్ద 1000 మంది మహిళలు, రైతులు, లోకవిద్యజనాందోళన కార్యకర్తలు హాజరై నివాళి అర్పించారు. అనంతరం ర్యాలిగా బయలుదేరి ముల్తాయ్ హైస్కూలు మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు.

ఈ సభనుద్దేశించి మాజీ శాసన సభ్యుడు, కిసాన్ సంఘర్ష్ సమితి నాయకుడు డా॥ సునీలం పాలకుల దుర్మార్గాన్ని ఎండగట్టారు. సభలో అమరవీరుల కుటుంబ సభ్యులకు సన్మానం జరిపి గౌరవించారు. లోకవిద్యజనాందోళన నాయకులు, మధ్యప్రదేశ్ కిసాన్ సంఘర్ష్ సమితి నాయకులు, మహిళా నాయకురాలు శ్రీమతి తంతి చౌదరి తదితరులు ప్రసంగించారు. అనేకమంది కిసాన్ సంఘర్ష్ సమితి నిర్వహించిన రక్తదానం కార్యక్రమంలో పాల్గొని రక్తం దానంచేసారు. ముల్తాయ్ రైతుల కోర్కెల పత్రాన్ని చదివి సభ ఏకగ్రీవ ఆమోదం పొందారు. లోకవిద్యాజనాందోళన అమర వీరుల స్మృతి దినం సందర్భంగా సమావేశాలు నిర్వహించడానికి ఆహ్వానించి సదస్సును జయప్రదం చేయడం కిసాన్ సంఘర్ష్ సమితి తమకిచ్చిన గౌరవంగా గుర్తించి వారికి కృతజ్ఞతలు తెల్పింది.

**- లోకవిద్య ప్రతినిధి**

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. A.P.-500 060.



## 2013 డిసెంబర్ 30న అడ్డతీగల సదస్సులో ఆహార సారభౌమత్వంపై ఆదివాసి, దళిత, రైతుల, శాస్త్రజ్ఞులు, విద్యార్థుల విధాన ప్రకటన

2010వ సంవత్సరంలో గోదావరి ఒడ్డున ఉన్న 12 ఆదివాసి గ్రామాల ప్రజలు, గ్రానైట్ గనుల త్రవ్వకాలకు వ్యతిరేకంగా, ఐక్యసంఘటనగా ఏర్పడ్డారు. వీరి ఆధ్వర్యంలో 2013 డిసెంబర్, 28-30 డి. భీమవరం గ్రామం ఆంధ్ర, తెలంగాణా సరిహద్దులో ఆదివాసి, దళితులు, రైతులు, శాస్త్రజ్ఞులు, విద్యార్థులు, పర్యావరణవేత్తలు, 20 ప్రజాసంఘాలు, మేధావులు హాజరై భూమిపై హక్కు, ఆహారసారభౌమత్వంపై చర్చించి, పెళ్ళిపడుగు విధాన ప్రకటనను రూపొందించారు.

గిరిజన ప్రాంత భూముల్లో తరతరాలుగా వేసే బహుముఖ పంటలు ఒక ప్రక్కన ఆహారభద్రతతో పాటు, మరొక ప్రక్క పర్యావరణ పరిరక్షణకు అనువుగా వున్నాయి. ఈ మధ్య పారిశ్రామికవేత్తల బహుళజాతి సంస్థల ప్రవేశంతో అభివృద్ధి పేరుతో జరుగుతున్న గ్రానైట్ త్రవ్వకాలవల్ల మన ఆహారం, భూమి, మట్టి కలుషితం కావటం జీవవైవిధ్యం దెబ్బతినటంవల్ల ప్రజలు ప్రాథమిక హక్కులను కోల్పోతున్నారు.

మన ప్రజలకు కావలసిన సరిపడా ఆహారం భూమితల్లి నుండి పొందుతున్నాం. బహుముఖ పంటలతో విత్తన, ఆహార రకాలు, పప్పులు, నూనెగింజలు, వేళ్ళు, దుంపలు, పండ్లు, కూరగాయలు, జంతువులు, కీటకాలు, చేపలు వివిధ జాతుల తెగల కమ్యూనిటీల ఆహార సంస్కృతి భూమి ఆహారంపై యాజమాన్యంతో అభివృద్ధి చేసుకొంటున్నారు. స్థానిక మార్కెట్లపై ఆధారపడిన ప్రజల మధ్య సంబంధాలు పరస్పరం ఆధారమైనవి. ఇవి లాభం కొరకు వినియోగించేవి కావు.

స్త్రీలు ఆహార సార్వభౌమత్వంలో ప్రధానమైన నాయకురాళ్ళు. పితృస్వామ్య ఆధిపత్యాన్ని ఎదిరించి ఆహార సార్వభౌమత్వం కోసం పోరాటంలో స్త్రీలు ముందువరుసలో ఉన్నారు. కార్పొరేట్ మార్కెట్ల విస్తరణను ఎదిరించి మన ఆహార మార్కెట్‌ను పరిరక్షించుకునే శక్తి రైతాంగానికి ఉంది.

మన భూమి, అడవులు, నీరు, గాలి, బహుముఖ పంటలు, జీవివైవిధ్యం, విత్తనాలు, జ్ఞానం, సంస్కృతి అమ్మకపు వస్తువులు కావు. మా జీవితాలను, వనరులను నియంత్రించేవాటిని గట్టిగా ఎదిరిస్తాం.

ఆహార రక్షణ అనేది ఆహార సార్వభౌమత్యం ద్వారానే సాధ్యం. ఈ క్రింది కోర్కెలను రాజ్యం అమలు చేయాలని కోరుతున్నాం.

1) సాంప్రదాయ ఆదివాసి కమ్యూనిటీలు, తెగల హక్కులని, వ్యక్తిగత హక్కులను గౌరవించాలి.
2) పంచాయితీరాజ్ (షెడ్యూల్ ఏరియా విస్తరణ) చట్టం 1996, అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం గ్రామ సభల అధికారాన్ని రాజ్యం గౌరవించాలి.
3) మన వనరులను స్థానిక అవసరాలకు ఈ దేశంలో ఉత్పత్తి, కొనుగోలు, పంపకం మన ఆహార రక్షణను దృష్టిలో పెట్టుకొని నిర్ణయించాలి.
4) రాజ్యం కార్పొరేట్ కుమ్మక్కుతో మన వ్యవసాయ వ్యవస్థలో విత్తనాలు, వ్యవసాయ పద్ధతులు, పాలు, కోళ్ళపారం, మరియు చేపల పంపకంలో అమలు చేస్తున్న విధ్వంసకర విధానాలను ఖండిస్తున్నాం.
5) స్వాతంత్ర ఆదివాసి అటవీప్రాంతాలను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తూ, సాంప్రదాయ ఆదివాసి సంస్కృతి, ఉపాధి కోల్పోవటం ప్రజలను వలసలకు గురిచేయడాన్ని ఖండిస్తున్నాం.
6) ప్రపంచ ఆర్థిక సంస్థ చర్చలలో ఇండోనేషియాలోని బాలి చర్చలలో మన ఆహార వ్యవస్థకు, సార్వభౌమత్వానికి ముప్పుకలిగించే "శాంతిక్లాజ్" పేరుతో ఆమోదం పొందడాన్ని వ్యతిరేకిస్తున్నాం.
7) మన జీవితాలకు ఉపాధి సౌకర్యాలకు నష్టం కలిగించే స్వేచ్ఛ, వాణిజ్య ఒప్పందాలపై మారిటోరియం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం.
8) రిటైల్ వ్యాపారంలో విదేశీ కంపెనీల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తున్నాం.
9) సుప్రీంకోర్టు ద్వారా నియమించబడిన జన్యుమార్పిడి సాంకేతిక నిపుణుల కమిటీ సిఫార్సుల ప్రకారం జన్యుమార్పిడి విత్తనాల ప్రయోగాన్ని నిలిపివేస్తూ, ప్రభుత్వ, వ్యవసాయ అధికారులు జన్యుమార్పిడి విత్తనాలను ఏ రూపంలో కూడా ప్రోత్సహించకూడదని దీని వాడకాన్ని మేము వ్యతిరేకిస్తున్నాం.
10. మన జ్ఞానంతో, జీవవైవిధ్యంతో తయారయైన వస్తువులను పేటంట్‌పేరుతో లాభాలు కొల్లగొట్టే విధానాన్ని వ్యతిరేకిస్తాం.
11) వాతావరణ మార్పులకు కారణం సరళీకృత గ్లోబల్ పారిశ్రామిక ఆహార వ్యవస్థ విధానాలని, ఆహార సార్వభౌమత్వమే వాతావరణ సమతుల్యతకు పరిష్కారమని స్పష్టం చేస్తున్నాం.
12) రాజ్యం యొక్క విధ్వంసకర కార్యక్రమం అయిన (ఐ.ఎన్.ఎస్.ఐ.ఎం.పి) తృణధాన్యాల ప్రోత్సాహం పేరుతో స్థానిక జీవవైవిద్య, స్వతంత్ర వ్యవసాయ విధానాలకు ప్రమాదకరమని స్పష్టం చేస్తున్నాం.
13) మన పొలాల్లో, అడవుల్లో ఒకే రకమైన పంటల విధానాన్ని నిలిపివేయాలని బహుముఖ పంటలను వేయాలని కోరుతున్నాం.

**- డి. భీమవరం, పెళ్ళిపడుగు విధాన ప్రకటన**

ఈ పత్రికలోని వ్యాసాలు యధాతథంగా పునఃప్రచురణ హక్కులు అందరివి.

**మీకు తెలుసా!**
**ప్రజాస్వామ్యం అనే వృక్షం వికసిస్తూనే ఉండాలంటే దాని వేళ్ళకి దేశభక్తుల మరియు దేశద్రోహుల రక్తంతో తడపాల్సిందే.**
**అచేతనులుగా, మౌనంగా మంచివాళ్ళుంటే దుర్మార్గులు రాజ్యం చేస్తారు.**
- అమెరికా జాతిపిత మూడవ అధ్యక్షులు స్వతంత్ర ప్రకటన అద్యుడు థామస్ జఫర్సన్

మా సంస్థ గురించి మరియు పాత పత్రికల గురించి చూడవల్సిన
వెబ్ పేజీ : Loka Vidya blogspot vidyaashram
**http : // www.vidyaashram.org/lokavidya_prapancham.html.**
**http : // vidyaashram.org/papers/LJA-Announcement_Telugu.pdf**

**BOOK - POST PRINTED MATTER**
**16 JANUARY - 1 FEBRAURY-2014**

To

వ్యాసాలు, ఉద్యమ వార్తలు పంపించవలసిన చిరునామా :
**Loka Vidya Prapancham**
**D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters,**
**Saroornagar (M), R.R. Dist. A.P.- 500 060 Ph : 040-24152155**
**e-mail : tnrkoundinyasa@yahoo.com**

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. A.P.-500 060.